ప్రజాశక్తి

సోమవారం 24 ఫిబ్రవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఫలించిన పోరాటాలు

◆ గిరిజన పల్లెలకు తాగునీరు, రహదారులు, విద్యుత్

◆ ఏళ్ల తరబడిలేని కనీస సౌకర్యాలు దక్కడంతో అందరిలో ఆనందం

అడ్డాకులు, డోలీలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని నాన్ షెడ్యూల్ మండలాల్లో సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ పోరాటాలతో గిరిజన గ్రామాలకు కనీస సౌకర్యాలు లభిస్తున్నాయి. కరెంటు వెలుగు తెలీని గ్రామాలకు విద్యుత్ సదుపాయం వచ్చింది. రహదారులు మంజూరు కావడంతో డోలీ మోతల బాధ తప్పనుంది. గెడ్డనీరు తాగే గిరిజనులకు సురక్షిత నీరు అందుబాటులోకి వచ్చింది. గిరిజన గ్రామాలకు లభించే ప్రతి సౌకర్యం వెనుక సుదీర్ఘ పోరాటం వుంది. సిపిఎం, నాన్ షెడ్యూల్ గిరిజన సంఘం కృషి వుంది. పట్టువిడవకుండా గిరిజనుల సమస్యలపై నిర్వహించిన నిరంతర పోరాటాల ద్వారా సాధించిన విజయాలతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కాలినడకన గిరిజన గ్రామాలను సందర్శించారు. గిరిజన సమస్యలను అర్థం చేసుకొని రహదారులకు నిధులు మంజూరు చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని చేసిన పోరాటంతో రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీలోని పివిటిజి గ్రామాలు పిత్రిగడ్డ, పెద్దగరువుకు 15వ ఆర్థిక సంఘం నిధులతో ఇంటింటికీ కుళాయి సౌకర్యం కలిగింది. రేషన్ కార్డులు లేని కొత్తగా పెళ్లయిన తొమ్మిది కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూర య్యాయి. పిత్రిగడ్డ. నీళ్లబందలో 18 మంది పిల్లలకు ప్రత్యామ్నాయ పాఠశాలను పిత్రిగడ్డలో ఏర్పాటు చేశారు.

పెద్దగరువు, పాత లోసింగి, కొత్త లోసింగికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఆశా కార్యకర్తను నియమించాలని చేసిన పోరాటం ఫలించింది. గతేడాది మిగతా 2లో..

ప్రారంభమైన నేరేడు బంద రోడ్డు పనులు

విశాఖలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద బారులుతీరిన గ్రూప్ - 2 అభ్యర్థులు

బందోబస్తు నడుమ గ్రూప్-2 పరీక్ష

◆ సమస్యాత్మక కేంద్రాల్లో డ్రోన్లతో నిఘా

◆ తొలి పేపర్‌కు 9,391, రెండో పేపర్‌కు 9,370 మంది హాజరు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ జిల్లాలో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోలేదు. పరీక్షకు మూడు రోజుల ముందు జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం తగు జాగ్రత్తలు తీసుకుంది. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. నిర్దేశిత సమయానికి అభ్యర్థులంతా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 6.30 గంటలకే లైజన్ అధికారులు సంబంధిత మెటీరియల్‌తో కేంద్రాలకు వచ్చారు. ఎపిపిఎస్‌సి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ముందస్తు చర్యలూ చేపట్టారు. నిబంధనలు పాటిస్తూ పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి పోలీసు భద్రత నడుమ పరీక్షా కేంద్రాలకు తరలించారు. గ్రూప్-2 ప్రధాన పరీక్షను సజావుగా, విజయవంతంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తగిన చర్యలు తీసుకున్నారు. ఒక రోజు ముందుగానే జాయింట్ కలెక్టర్ మిగతా 2లో..

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

▶ వార్త 2లో..

నన్ను గెలిపిస్తే ప్రతి ఉపాధ్యాయుడూ గెలిచినట్టే

▶ వార్త 5లో..

మంచినీళ్లు ఇప్పించండి మహాప్రభో..

▶ వార్త 6లో..

క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న శివానంద

కుంభమేళాకు వెళ్తుండగా ప్రమాదం

- లారీని ఢీకొన్న ప్రయివేటు బస్సు
- 12 మందికి గాయాలు

వార్త మెయిన్‌లో..

ప్రజల విశ్వాసం కోల్పోతున్న కూటమి

వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో - ఆర్డినేటర్ కురసాల కన్నబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమించబడిన అనంతరం మొదటిసారి విశాఖపట్నం జిల్లా కార్యాలయానికి విచ్చేసిన కన్నబాబుకు పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చంద్రన్న పగ, చంద్రన్న దగా అనే పథకాలు అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, తమ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం విశాఖను పరిపాలనా రాజధానిగా చేయాలని చూశామని అన్నారు. గ్రూప్ 2 అభ్యర్థులను ప్రభుత్వం నిట్టనిలువునా మోసం చేసిందని, వేల కోట్లు అప్పు చేసి చంద్రబాబు ఏం చేశారో తెలియడంలేదని అన్నారు. పలువురు నాయకులు తమ పార్టీపై విష ప్రచారం చేస్తున్నారని, జగన్ కోసం ప్రాణాలు ఇచ్చేవారు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నారని గుర్తెరగాలని ఆయన అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కన్నబాబు

మొదటి పేజీ తరువాయి..

ఫలించిన పోరాటాలు

జూన్‌లో లోసింగిలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేశారు. 40 మంది జనాభా కలిగిన పిత్రిగడ్డకు ఆర్ల నుండి బిటి రోడ్డుకు రూ.4.50 కోట్లు, 30 మంది జనాభా కలిగిన పెదగరువుకు వైబి.పట్నం నుంచి బిటి రోడ్డుకు రూ.2.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. నీళ్లబంద, పశువులు బంద, సోంపురం బంద, జిలుగులోవకు కరెంటు సౌకర్యం కలిగింది. తాజాగా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీలోని జెడ్.జోగింపేట నుంచి 12 కుటుంబాలున్న గిరిజన గ్రామం నేరేళ్లబంద వరకు రూ.2.5 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సౌకర్యాల కల్పన వెనుక సిపిఎం, గిరిజనుల ఆరేళ్ల పోరాటం వుంది. గతేడాది డిసెంబరులో అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలంలో దాదాపు రూ.11.60 కోట్ల విలువైన రెండు రహదారి పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అటవీ అనుమతుల్లేక ఆ రహదారి పనులు ప్రారంభించలేదు. సిపిఎం పోరాటంతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. వారం రోజుల్లో నేరేళ్ల బంద రహదారి పనులకు నిధులు మంజూరు, అటవీ అనుమతులు పొంది పనులు ప్రారంభించారు.

సౌకర్యాల సాధన వెనుక ఆరేళ్ల పోరాటం

నాన్ షెడ్యూల్ గిరిజనుల సమస్యలను 2015లో గుర్తించాం. కాలినడకన పాతలోసింగి, పెదగరువు, పిత్రిగడ్డ, కొత్త లోసింగి వెళ్లి పెద్దగరువులో ఆ రాత్రి వున్నాం. గిరిజనులు పడుతున్న ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా తెలుసుకున్నాం. వాటిని ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాం. వినతులు, విజ్ఞాపనలతో మొదలై పోరుబాట పట్టాం. వివిధ రూపాల్లో, వివిధ స్థాయిల్లో ఆరేళ్లుగా పోరాటాలు చేపట్టాం. ఆ కృషి ఫలితంగా నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలకు 76 ఏళ్ల నుంచి లేని తాగునీరు, రోడ్లు, ప్రత్యామ్నాయ పాఠశాలలు, విద్యుత్ సౌకర్యాలు లభించాయి. జనన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు పొందారు.

- కె.గోవిందరావు,
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

ఎయులో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

బందోబస్తు నడుమ గ్రూప్-2 పరీక్ష

అన్ని కేంద్రాల తాలూకా పరిస్థితులను తెలుసుకొని జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. శనివారం రాత్రి జరిగిన ఆందోళనల నేపథ్యంలో సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా పెట్టారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమే కాకుండా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అన్ని పరీక్షా కేంద్రాలను కెమెరాలతో అనుసంధానం చేస్తూ డ్యాష్ బోర్డుతో కూడిన కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా పరిస్థితిని సమీక్షించిన జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్ ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు నివేదించారు.

ఉదయం వచ్చిన వారిలో 21 మంది మధ్యాహ్నం గైర్హాజరు

గ్రూప్-2 ప్రధాన పరీక్షకు జిల్లాలో మొత్తం 11,030 మంది దరఖాస్తు చేసుకోగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగిన తొలి పేపర్‌కు 9,391 (85.14 శాతం) మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగిన రెండో పేపర్‌కు 9,370 (84.95 శాతం) మంది హాజరయ్యారు. ఉదయం వచ్చిన వారిలో 21 మంది అభ్యర్థులు మధ్యాహ్నం జరిగిన పరీక్షకు హాజరుకాలేదు. కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ఒక అభ్యర్థి బిపి తగ్గడంతో అస్వస్థతకు గురయ్యారు. అధికారులు వెంటనే స్పందించి పోలీసు భద్రత నడుమ సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఎయు ఇంజినీరింగ్ కాలేజీ మెయిన్ బ్రాంచ్, న్యూ క్లాస్ రూమ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను, అలాగే జైలు రోడ్డులోని డిగ్రీ మహిళా కళాశాల, సీతంపేట పరిధిలోని బివికె, ప్రిజమ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు.

ఆనందపురం : మండలంలోని గుడిలోవ ఏక్యూజే కళాశాలలో ఆదివారం గ్రూప్- 2 పరీక్షలు నిర్వహించారు. 1248 మంది హాజరుకావాల్సి ఉండగా 1087 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఆనందపురం సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ గంట్యాడ సంతోష్, సిబ్బంది చేరుకొని బందోబస్తు చర్యలు చేపట్టారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

శ్రీశైలంకు విశాఖ నుంచి అదనపు సర్వీసు
విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహా శివరాత్రి నేపథ్యంలో పలుచోట్లకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన పలు విషయాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

శివరాత్రికి ఎక్కడెక్కడకు బస్సులు ఏర్పాటు చేశారు ?

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివరాత్రి జాగరణ అనంతరం సముద్ర స్నానాలు ఆచరించే వారి కోసం బుధవారం అర్ధరాత్రి నుండి గురువారం సాయంత్రం వరకు గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి ప్రాంతాల నుంచి అప్పికొండకు ప్రత్యేక బస్సులు నడపనున్నాం. అదేవిధంగా తగరపువలస, భీమిలి, ఆరిలోవ కాలనీ, రవీంద్ర నగర్, పెందుర్తి, కొత్తవలస, సింహాచలం, గాజువాక, కూర్మన్నపాలెంల నుంచి ఆర్‌కె.బీచ్‌నకు బస్సులను తిప్పనున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి అధికారుల పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు బస్సులు ఏర్పాటు చేస్తాం. భక్తులు, ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

నిర్వహణ ఎలా ?

వాల్తేర్ డిపోలో అధికారులు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, గ్యారేజ్ సూపర్‌వైజర్లు గ్యారేజ్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి బస్సులు మార్గం మధ్యలో

విఫలమవకుండా, ఎప్పటికప్పుడు బస్సుల నిర్వహణ చేస్తూ, మంచి కండిషన్‌లో ఉంచుతూ లైన్‌లోనికి పంపించాలని చెప్పాం. ఎటువంటి ఫిర్యాదులూ రాకుండా చూడాలని ఆదేశించాం.

శ్రీశైలంకు ఏమైనా బస్సులు ఏర్పాటు చేశారా ?

శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీశైలం వెళ్లే భక్తులకు ప్రస్తుతం తిరుగుతున్న బస్సునకు అదనంగా బుధవారం విశాఖపట్నం నుండి శ్రీశైలంనకు మధ్యాహ్నం 2 గంటలకు సూపర్ లగ్జరీ బస్సును సాధారణ బస్సు ఛార్జీ రూ.1230తో ద్వారకా బస్సు స్టేషన్ నుంచి నడుపనున్నాం. టికెట్స్ కావలసినవారు ఆన్‌లైన్‌లోగానీ, ద్వారకా బస్సు స్టేషన్‌లోగానీ సంప్రదించాలి. 7095605769, 9959225602, 9100109731 నెంబర్లను కూడా సంప్రదించవచ్చు.

వికసిత భారత్ లక్ష్యంగా బడ్జెట్

కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వికసిత భారత్ - 2047 లక్ష్యంగా తాజా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం విశాఖపట్నంలోని హోటల్ రాక్ డేల్‌లో బిజెపి జిల్లా అధ్యక్షులు ఎమ్.పరశు రామరాజు అధ్యక్షతన కేంద్ర బడ్జెట్‌పై మేధావులతో సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసవర్మ మాట్లాడుతూ బడ్జెట్‌లో అన్ని రకాలుగా సమతుల్యత పాటించామన్నారు. మధ్యతరగతి ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వానికి లక్ష కోట్ల రూపాయలు ప్రతి ఏడాదీ నష్టం వాటిల్లే అవకాశం ఉన్నప్పటికీ లెక్కచేయకుండా 12 లక్షల ఆదాయం వచ్చే వారికి సైతం పన్ను నుంచి మినహాయింపు ఇచ్చినట్టు పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాలకు కాకుండా దేశ ప్రయోజనాలకే బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసిందని చెప్పారు. త్వరలో విశాఖపట్నంలో ఎఐ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని, అమరావతి నిర్మాణానికి, పోలవరానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర పథకాలు రాష్ట్రంలో నత్తనడకన సాగాయని, జగన్ సహకరించకపోవడంతో రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ పూర్తి కాలేదని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామని చెప్పారు. ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసే ఉద్దేశం కేంద్రానికి లేదని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే, బిజెపి శాసనసభ పక్ష నేత పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

జగన్, పెద్దిరెడ్డి దోపిడీపై అసెంబ్లీలో చర్చించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, ఆయన మంత్రివర్గంలో పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల దోపిడీ వ్యవహారాలపై అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వస్తారని ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై జగన్ మాట్లాడాలన్నారు. ప్రతిపక్ష నాయకుని హోదా కోసం జగన్ అసెంబ్లీకి వెళ్తే ప్రజలు హర్షించరన్నారు. గత ఐదు సంవత్సరాలలో ప్రకృతి వనరులను నాశనం చేసినందుకు జగన్, వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేయని పనులను కూటమి ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్ట్‌ను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న పేరు ప్రతిష్టలు చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు ఉపకారవేతనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమెరికన్ ప్రొగ్రసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) అధ్వర్యంలో విశాఖపట్నంలోని ఆళ్వారుదాసు విద్యాసంస్థ ఐఐఎం కళాశాల వేదికగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ప్రతి ఏటా ఇచ్చే అమెరికన్ స్టూడెంట్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం - 2025 కార్యక్రమం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అల్లియన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 105 గవర్నర్ దండెం పోలారావు మాట్లాడుతూ పేదరికం వల్ల ఎవరి చదువూ ఆగిపోరాదనే సదుద్దేశంతో అమెరికన్ ప్రొగ్రసివ్ తెలుగు అసోసియేషన్ నిధులు సమకూర్చి పేద విద్యార్థులకు అందిస్తోందన్నారు. ఈ మహాత్కార్యాన్ని నిర్వహించడం అత్యంత ఆనందదాయకమన్నారు. స్కాలర్‌షిప్పులు అనేవి విద్యార్థుల బాధ్యతను మరింత పెంచుతాయని, ఈ స్కాలర్‌షిప్పుల ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన అన్నారు. మరో అతిథి రమేష్ మాట్లాడుతూ ఇప్పుడు ఇచ్చే ఈ స్కాలర్ షిప్‌ల వెనుక అమెరికాలో రోజూ 18-20 గంటల పనిచేస్తున్న ఎంతో మంది శ్రమ ఉందని అన్నారు. ఆప్తా సభ్యులు పాశం నవీన్ మాట్లాడుతూ 2008లో పది మంది సభ్యులతో ఏర్పడిన ఆప్తా నేడు 10 వేల మంది సభ్యులను కలిగి 35 విభాగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌లు అందించడానికి ఆప్తా అధ్యక్షులు మధు ఉల్లి, కార్యదర్శి విజయ్ కొచ్చెర్ల, ఎఎస్ఇపి చైర్ అనిల్ ఆరిగే, ఆప్తా సభ్యులు సుంకరి శ్రీరామ్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుండి ఎంపిక చేయబడిన 50 మంది విద్యార్థులకు రూ.10 లక్షలు అందించినట్టు తెలిపారు. ఆప్తా సభ్యులు బలిరెడ్డి సుహాస్, దండెం ప్రతాప్, ఎంబిఎస్ గ్లోబల్ దుబాయ్ డైరెక్టర్ ఆఫ్ టెక్నాలజీ సలాది సతీష్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందుకున్న వారితో ఆప్తా సభ్యులు

సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనపై గీతంలో వర్క్‌షాప్

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అతిథులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ ఆధ్వర్యాన "సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తన" అనే అంశంపై ప్రమోషన్ ఆఫ్ అకడమిక్, రీసెర్చ్ కొలాబరేషన్ (స్పార్క్) వర్క్‌షాప్ నిర్వహించారు. భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ సహకారంతో స్పార్క్ పథకంలోని ఐఐటి ఖరగ్‌పూర్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ భద్రత, డిజిటల్ నైతికత, బాధ్యతాయుతమైన ఇంటర్నెట్ వినియోగం గురించి విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు రెండురోజుల పాటు అవగాహన కల్పించారు. ఆదివారంతో ముగిసిన ఈ కార్యక్రమానికి గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా హజరై మాట్లాడుతూ, గ్లోబల్ కనెక్టివిటీ పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో డిజిటల్ భద్రత ఎంత ముఖ్యమైందో వివరించారు. వ్యక్తులకు సురక్షితంగా ఇంటర్నెట్‌ను వాడే అవగాహన, నైపుణ్యాలను అందజేయడంలో వర్క్‌షాప్ కీలక పాత్ర పోషిస్తుందని, సాంకేతికతను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుందని తెలిపారు.

ఐఐటి ఖరగ్‌పూర్ స్పార్క్ ప్రాజెక్టు జాతీయ సంయుక్త కో-ఆర్డినేటర్, కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ రబీంద్రత ముఖర్జీ మాట్లాడుతూ, సైబర్ భద్రతా విద్య, సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనను ప్రోత్సహించడం ద్వారా వ్యక్తులు, సంస్థలను డిజిటల్ ముప్పు నుండి రక్షించవచ్చని పేర్కొన్నారు. స్పార్క్ ప్రాజెక్ట్ రష్యన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, ఉరల్ ఫెడరల్ యూనివర్సిటీ (రష్యా) ప్రొఫెసర్ ఎడ్వర్డ్ పత్రకోవ్ ఈ వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరిస్తూ, డిజిటల్ ప్రపంచాన్ని సురక్షితంగా అనుసంధానించుకునే ప్రాథమిక జ్ఞానం, నైపుణ్యాలను అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

గీతం హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విభూతి సచ్దేవ్ ఆన్‌లైన్ భద్రతా సవాళ్లను ఎదుర్కొనడానికి అంతర విభాగ సహకారం ఎంతో అవసరమని సూచించారు. రష్యా నుండి డాక్టర్ లియూడ్మిలా బటురినా ప్రత్యేక ఆన్‌లైన్ సెషన్ నిర్వహించారు. "డిజిటల్ పర్యావరణం, యువతకు ముప్పులు" అనే అంశంపై ఆమె సవివరంగా మాట్లాడారు. 70 మందికిపైగా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని, సురక్షిత డిజిటల్ ప్రవర్తన పాటించే వ్యూహాలను నేర్చుకున్నారు. ఈ వర్క్‌షాప్‌లో గీతం హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ నళిని బిక్కినా, డాక్టర్ రవిశంకర్ దత్తి, ఉరల్ ఫెడరల్ యూనివర్సిటీ (రష్యా) నుండి డాక్టర్ ఎడ్వర్డ్ పత్రకోవ్, డాక్టర్ లియూడ్మిలా బటురినా రిసోర్స్ పర్సన్లుగా పాల్గొని ఇంటరాక్టివ్ చర్చలు, కేస్ స్టడీస్, ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : అప్పుల బాధ తాళలేక జివిఎంసి నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడ జగనన్న కాలనీలో నివసిస్తున్న చిరు వ్యాపారి కె.గోవిందరాజు (55) శనివారం రాత్రి చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీధుల్లో ప్లాస్టిక్, ఇనుప సామగ్రి వస్తువుల కొనుగోలుతో పాటు ఐస్ క్రీమ్ అమ్ముతూ వచ్చే అర కొర ఆదాయంతో జీవించే వాడు. అధికంగా అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాజువాక : అక్కిరెడ్డిపాలెంలో నివసిస్తున్న కర్రి ప్రవీణ్ (27) విశాఖ డెయిరీ సర్వీస్ రోడ్డులో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాల కారణంగా చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు కర్రి ప్రవీణ్ ఫ్రూట్ షాప్‌లో పనిచేస్తున్నాడు. మరిన్ని వివరాల కోసం గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయంలో పెళ్లిరాట

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర శివాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామివారి పెళ్లిరాట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకొని ఈ ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. సోమవారం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం అనంతరం కల్యాణోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

అన్నదాతకు అండగా పరిశోధనలు

ప్రజాశక్తి -మధురవాడ : అన్నదాతలకు అండగా ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ (ఐడిఎస్‌ఎపి) పరిశోధనలు చేస్తుందని ఆ సంస్థ డైరక్టర్ ఆచార్య ఎస్ గలాబ్ తెలిపారు. జివిఎంసి 8వ వార్డు పరిధి మిథిలాపురి వుడాకాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2018-19 ఆర్థిక సంవత్సరం నుండి ప్రముఖ ఆర్థికవేత్త ఆచార్య రొక్కం రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో సంస్థ మనుగడ ప్రారంభమైందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ఆధారంగా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలనే ప్రాజక్టును కొనసాగిస్తున్నామన్నారు. సేంద్రీయ వ్యవసాయం, పంటల మార్పిడి, చీడపీడలు, భూసార పరీక్షలును క్షేత్రస్థాయిలో తమ బృందాలు పరిశోధనలు చేసి అన్నదాతలకు సలహాలు, సూచనలు ఇస్తుందన్నారు. వాటి ఆధారంగా సేద్యం చేస్తే రైతులకు ఆర్థికంగా కలిసివస్తుందని వివరించారు. ఈ సమావేశంలో జె.రామునాయుడు, సంబమూర్తి పాల్గొన్నారు.

శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సుధారాణి మ్యూజిక్ డాన్స్ అకాడమీచే శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. స్వాగతాంజలి, గణపతి నృత్యం, పుష్పాంజలి, గరుడగమన, వామగిరి తనమే, రామ రామ తారకం, భాగవద్గీత శ్లోకాలు, కోలాటం, పునకాలు, కోలాటం, హనుమాన్ చాలిసా తదితర గేయాలకు కాత్వకే, హవీష్, వర్ష కుందనప్రియ, సాయినిధి, పారు నారాయణ, భువన గీలా, గోపాలకృష్ణ, షణ్ముక్ తదితర 40 మంది చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

సృజనాత్మకంగా ఆలోచనలు

కేథరిన్ వార్షికోత్సవ ముగింపులో వక్తలు

ప్రజాశక్తి -తగరపువలస : ఆలోచనలు సృజనాత్మకంగా ఉండాలని పలువురు వక్తలు స్పష్టం చేశారు. స్థానిక మూలకుద్దు కేథరిన్ పాఠశాల 41 వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ముఖ్య అతిథిగా భారత ప్రభుత్వ ఎస్‌టిపిఐ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాత్ హాజరై మాట్లాడుతూ, ప్రతి అంశంపై నిశిత పరిశీలన అవసరమని విద్యార్థులకు నొక్కి చెప్పారు. కారణాలు ఏమైనా గానీ ప్రతి ఒక్కరిలో ఆలోచనా శక్తి క్రమంగా సన్నగిల్లుతోందని, దీన్ని అధిగమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథి ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త రెగివ అభిషేక్‌రాజ్ మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులే కాదు తల్లి దండ్రులదీ బాధ్యతే అన్నారు. ఒకనాడు అవకాశాలు, పోటీతత్వం తక్కువగా ఉండేవని, నేడు పోటీతత్వానికి దీటుగా అవకాశాలు మన ముందు ఉన్నాయని వివరించారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం చదువుతో పాటు క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులను సత్కరించారు. ముందుగా ఐక్య రాజ్య సమితి సమావేశాల నిర్వహణపై ఏర్పాటు చేసిన నమూనా ఎంతగానో ఆలోచింప జేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు ఆచార్య ఆర్‌డి.రత్నరాజ్, కరస్పాండెంట్ ఆలివర్‌రాయి, డైరెక్టర్ ఇవాంజలిన్ రాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్య అతిథులు

పూర్వ విద్యార్థుల కలయిక

పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 పదో తరగతి చదివిన విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులందరూ అదే పాఠశాలలో కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ముఖ్య అతిథులుగా అప్పటి ప్రధానోపాధ్యాయులు పట్నాయక్, ఉపాధ్యాయులు అప్పలరాజు, గాయత్రి, ప్రసాద్, నారాయణమూర్తి, శ్రీనివాసరావు, శేషగిరి, రవి, ప్రసాద్, జాన్‌పాల్, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. కష్టసుఖాల్లో ఒకరికి ఒకరం తోడుంటామని ప్రతిజ్ఞ చేసుకున్నారు. చాలా రోజుల తర్వాత ఇలా కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు కె.నారాయణమ్మ, కె.ప్రసాద్, ఎం.జనార్ధన్, పి.రమణ, స్వామినాయుడు, కంచుబోయిన పైడిరాజు, లావణ్య తదితరులు తెలిపారు.

చిన్నారుల్లో కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : చిన్నారుల్లో కేన్సర్‌పై అవగాహన పెంచడం, సరైన చికిత్స అందుబాటులోకి తేవడం, కుటుంబాలకు మద్దతునివ్వడం లక్ష్యంగా మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్, శ్రేయా కేన్సర్ ఫౌండేషన్ కలిసి 'ఇన్‌స్పైరింగ్ యాక్షన్- 2025' కార్యక్రమాన్ని అక్కయ్యపాలెంలోని విశ్వనాధ్ స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించారు. బాల్య క్యాన్సర్ నుంచి కోలుకున్న పిల్లలు, వారి కుటుంబ సభ్యులు, వైద్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పిల్లలకు ఆనందాన్ని అందించేందుకు వినోద కార్యక్రమాలు, ఆటలు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. అనంతరం మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ వూన్నా మాట్లాడుతూ, చిన్నతనంలో కేన్సర్‌ను తొందరగా గుర్తించి, వైద్యం అందించడంతో పాటు, బతికి బయటపడిన పిల్లలకు దీర్ఘకాల మద్దతు అవసరం అని పేర్కొన్నారు. డాక్టర్ వై.రజనీ ప్రియ మాట్లాడుతూ, పిల్లల కుటుంబ సభ్యులకు మానసిక, భావోద్వేగ సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

నూకాలమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మార్చి 27 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్న శ్రీ నూకాలమ్మ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లిపిల్లి వేణుబాబు, ప్రధాన కార్యదర్శి యెచ్చర్ల హరి, ప్రతినిధులు పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, పాసి వినోద్‌కుమార్, గొరపల్లి సన్యాసిరావు, వి.కొండబాబు, అల్లిపిల్లి నరసింగరావు, కె.ముత్యాలరావు, ఎం.లక్ష్మణరావు, కె.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

హనీట్రాప్ కేసు ఛేదనలో పోలీసులకు ప్రశంస

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో హనీట్రాప్ పేరుతో వ్యక్తిని మోసగించిన కేసులో నిందితులను త్వరగా పట్టుకున్నందుకు విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి తన కార్యాలయంలో నేర విభాగం ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశరావుతో పాటు నలుగురు కానిస్టేబుళ్లను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. సంగివలస మూడమ్మవార్ల గుడి వద్ద శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రాంతానికి చెందిన ఎం.రామారావును కొంతమంది స్నేహితులతో కలిసి ఓ యువతి ఫోన్ చేసి మాయ మాటలతో నమ్మించి అతని నుంచి మొబైల్ ఫోన్, డబ్బులు తీసు కొని మోసం చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఎస్ఐ సూర్యప్రకాశరావు, నలుగురు క్రైమ్ పోలీస్ కానిస్టేబుళ్లు వ్యూహాత్మకంగా వ్యవహరించి నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంతో సిపి అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కార విభాగం జిల్లా అధ్యక్షునిగా శివాజీ

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామానికి చెందిన కోరుకొండ శివాజీ ప్రజా సమస్యల పరిష్కారం విభాగ జిల్లా అధ్యక్షులుగా నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులోని ప్రజా సంకల్ప వేదిక కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లాల కమిటీ నియామకంలో విశాఖ జిల్లా అధ్యక్షునిగా శివాజీని జాతీయ అధ్యక్షులు రంగసాయిరెడ్డి నియమించారు. ప్రస్తుతం ఆనందపురం మండలం కెజిబివి పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా శివాజీ ఉన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ పరిధి బానోజీతోటలోని టిడ్కో లబ్ధిదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఐ డిమాండ్ చేసింది. టిడ్కో గృహాల ప్రాంగణంలో ఆదివారం లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, బానోజీతోటలో టిడ్కో గృహాల నిర్మాణం పూర్తయి దశాబ్ద కాలం అయినా లబ్ధిదారులకు కేటాయించలేదని తెలిపారు. కొంతమందికి కేటాయించినప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదని పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచలేదన్నారు. తక్షణమే టాటా ప్రాజెక్టు అధికారులు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కృష్ణారావు, రమాదేవి, వెంకటలక్ష్మి, ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

గాజువాకలో కలశ యాత్ర

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాక కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి శ్రీనగర్‌లోని గాయత్రీ చేతన కేంద్రం వరకు కలశయాత్ర ఆదివారం సాగింది. మహిళలు కలశాలను పట్టుకొని యాత్రగా ముందుకు సాగారు.

క్రీడలపై మక్కువ చూపాలి : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : క్రీడలపై యువత మక్కువ చూపాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 75వ వార్డు పరిధి నెల్లిముక్కు, మొల్లివానిపాలెం క్రీడా మైదానంలో శ్రీ పెంటమాంబ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఎస్‌పిఎం క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంటును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోసం ప్రత్యేక నిధులు కేటాయించిందని తెలిపారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను, నిరుపయోగంగా ఉన్న క్రీడా మైదానాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అందుబాటులో తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జాతీయస్థాయిలో రాణించే క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా పరిసర ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి, మద్యం, మత్తు పదార్థాలు, బెట్టింగ్ జోలికి పోకుండా మైదానాల్లో సాధన చేసి శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవ్వాలని, క్రీడను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు మాట్లాడుతూ, బాలికలు కూడా రాణించడం అభినందించాల్సిన విషయం అన్నారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్లను కూడ ఈ మైదానంలో ఏర్పాటు చేయాలని ఆర్గనైజర్లను కోరారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ సిఐటియు నాయకులు నమ్మి రమణ, ఉరుకూటి సింహాద్రి, జి.శ్రీను, డాక్టర్ గోవింద్‌రెడ్డి, వార్డు అధ్యక్షులు నమ్మి అప్పారావు, ఒబిసి నాయకులు శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరావు మాట్లాడుతూ, క్రమశిక్షణతో పని చేసుకోవాలని సూచించారు. అనవసర విషయాలు, తగాదాలు, సెటిల్‌మెంట్లలో పాల్గొంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

దివ్యశ్రీని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి -ములగాడ : చదువుకున్న అమ్మాయిలు ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని, మహిళల పట్ల సమాజానికి ఉన్న చిన్న చూపును మార్చాలని భారత తూర్పు నౌకాదళ కెప్టెన్ రాజా రవి సనత్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సీనియర్ విద్యార్థినులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రతి మహిళా జీవితంలో అత్యున్నత లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ 'దిశ' యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ డిప్యూటీ మేనేజర్ ఎస్.ఉమామహేశ్వరరావు, ఫిజర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి పోలా శ్రీనివాస్, హ్యాపీ షాపీ అధినేత అనిల్ మాట్లాడుతూ, వ్యక్తిత్వాన్ని ఎలా వికసింపచేసుకోవాలో, నాయకత్వాన్ని ఎలా సాధించాలో వివరించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మిస్ సెంటాన్స్ పోటీలో విజేతలకు హ్యాపీ షాప్ ఆధ్వర్యాన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోటీలు, సదస్సులలో ప్రతిభ చూపిన వారికి అతిథులు బహుమతులను అందజేశారు. 2025 రిపబ్లిక్ డే పెరేడులో పాల్గొన్న కళాశాల జాతీయ సేవా పథకం వాలంటీర్ పి.దివ్యశ్రీని ప్రత్యేకంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సమర్థులను ఎన్నుకోండి

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమర్థులైన, అత్యంత విలక్షణమైన నేపథ్యం గల వ్యక్తిని ఎన్నుకోవాలని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడగలిగే వ్యక్తిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకే కాకుండా ప్రైవేటు ఉపాధ్యాయులకు కూడా ఆరోగ్య గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని, దీనికోసం ప్రత్యేక చట్టం చేయించగలగాలని పేర్కొన్నారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ కోసం తీర్మానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ లీగల్ : విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఉత్తరాంధ్ర నుంచి కాకినాడ వరకూ ఆరు జిల్లాలకు చెందిన న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం జిల్లా కోర్టు ఆవరణలోని నూతన బార్ అసోసియేషన్ సమావేశమందిరంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాలకు చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు. విశాఖపట్నంలో ప్రిన్సిపల్ హైకోర్టు, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అడ్వకేట్ అమెండ్‌మెంట్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, హైకోర్టు బెంచ్ కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు.

అంతకు ముందు జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ కోసం చేపడుతున్న కార్యాచరణలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేస్తామన్నారు. 1993 నుండి ఇందుకు ఉద్యమాలు జరుగుతున్నాయని ఇకపై పట్టు వీడేది లేదన్నారు. స్టీరింగ్ కమిటీ ఏర్పాటుచేసి తమ డిమాండ్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రతి న్యాయవాదీ తనవంతు సహకారం అందివ్వాలని కోరారు. వివిధ కేసుల మీద 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడకు వెళ్లడం చాలా కష్టమైన పని అన్నారు.

బార్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు పి.నర్సింగరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు జ్యుడీషియరీ సుముఖంగా ఉందని చెప్పారు. భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి.పార్వతీశం మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ కోసం సోమవారం నుండే లాయర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తుని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణశేఖర్, ఐఎఎల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీరాంబాబు, సీనియర్ న్యాయవాది చింతపల్లి రాంబాబు, న్యాయవాది మురళీమోహన్, శ్రీకాకుళం అధ్యక్షులు కిలారి ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు అన్నంనాయుడు, బొబ్బిలి సంఘం అధ్యక్షులు డి.తిరుపతిరావు, పాలకొండ సంఘం అధ్యక్షులు సింహాచలం, రాజాం, చోడవరం, తుని, నర్సీపట్నం, అనకాపల్లి, గజపతినగరం, యలమంచిలి విజయనగరం ప్రాంతాలకు చెందిన న్యాయవాదులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల తరహాలో హైకోర్టు కోసం ఆందోళనలు చేపట్టాలని పలువురు న్యాయవాదులు పిలుపునిచ్చారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ కార్యదర్శి నరేష్‌కుమార్, ఆల్ ఇండియన్ లాయర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బెవర సత్యనారాయణ

ఎర్రన్నాయుడుకు ఘన నివాళి

ఎర్రన్నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కలిశెట్టి

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : ప్రజాసేవలో నిబద్ధత, నిజాయతీ, ఆత్మీయత కలబోసిన నాయకుడు కింజరాపు ఎర్రన్నాయుడు అని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. పాత గాజువాకలోని టిడిపి కార్యాలయంలో బీసీ సెల్ ఆధ్వర్యాన నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అధ్యక్షతన ఎర్రన్నాయుడు 68వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు మించిన రాజకీయ జీవితంలో మచ్చలేని చరిత్రను సొంతం చేసుకున్న ఎర్రన్నాయుడు సేవలను స్మరించుకుందామని తెలిపారు. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు మరచిపోని ప్రజా నాయకుడు ఎర్రన్నాయుడు అని కొనియాడారు. ఢిల్లీ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ విభాగం అధ్యక్షుడు తమిరె శివ ప్రసాదరావు, అనంతలక్ష్మి, సింగూరు అనంత్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : కేంద్ర మాజీ మంత్రి కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి కార్యక్రమం ఆదివారం టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో జరిగింది. విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు హాజరై ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, నాయకులు ఎండి తాజుద్దీన్, హరి, బల్లి మధు, శివ, బొబ్బిలి శ్రీను పాల్గొన్నారు.

శెట్టిబలిజ వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి -సీతమ్మధార : శెట్టిబలిజ కులస్తులకు పెళ్లి సంబంధాలను సులభతరం చెయ్యడానికి వివాహ పరిచయ వేదిక ఏర్పాటుచేసినట్టు బిసి సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం శెట్టిబలిజ కట్టాస్ వివాహ పరిచయ వేదిక ఏర్పాటుచేయగా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, తూర్పు, పశ్చిమ గోదావరి, తెలంగాణ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో యువతీయువకులు, తల్లిదండ్రులు హాజరైనట్లు పేర్కొన్నారు. అనంతరం హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాల వ్యవస్థాపకుడు కండిపల్లి శ్రీనివాసరావుకు రూ.25వేలు, జైశెట్టి బలిజ యూ ట్యూబ్ చానల్ వ్యవస్థాపకుడు కండిబోయిన విజయకుమార్‌కు రూ.25వేలు చెక్కును కట్టా మల్లేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిఎంకె అధినేత గుత్తుల మీరాకుమార్, జై శెట్టి బలిజ వ్యవస్థాపకులు కట్టా శ్రీనివాసరావు, పాలిక శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, కడలి సుబ్బారావు, కాండ్రేగుల ఉమామహేష్, ఇల్లా వెంకటేశ్వరరావు, పిల్లి జయరాం పాల్గొని పరిచయ వేదిక నిర్వాహకుడు కట్టా మల్లేశ్వరరావును సత్కరించారు.

విశ్వంపై చర్చ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆది, అంతం లేనిది విశ్వం అని భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ అన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రాంతీయ హేతువాద సంఘ మహాసభ ఆర్.జగపతిరాజు అధ్యక్షతన పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. విశ్వతత్వం - పరిణామం అంశం మీద మేడూరి సత్యనారాయణ మాట్లాడుతూ, విశ్వం నియమబద్ధంగా పరిణమిస్తుందన్నారు. విశ్వ నియమాలను అవగాహన చేసుకోవడం ద్వారా మనుషులు స్వేచ్ఛను అనుభవిస్తారన్నారు. మనుషులను మతాలు, కులాలు, జాతులు, వర్గాలు నుంచి బయటకు తెచ్చి హేతుబద్ధంగా ఆలోచింప చేయాలన్నారు. గుమ్మా వీరన్న రచన హేతువాద మానవవాద తత్వవేత్త రావిపూడి వెంకటాద్రి గ్రంథాన్ని రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్, ఇంకొల్లు ట్రెజరర్ నల్లమోతు రాధాకృష్ణ ఆవిష్కరించి, సమీక్ష చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఆర్.జగపతిరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.పాండు రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాజి రాజశేఖర్, ప్రభు, ఎ.సత్యనారాయణ, సురేష్, షేక్ దరియావలి, ఎన్.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ సమస్యపై కేంద్రమంత్రికి వినతి

ప్రజాశక్తి -గాజువాక : భెల్ హెచ్‌పివిపి కార్మికులు, ఉద్యోగుల పిఎఫ్ సమస్యపై గుర్తింపు యూనియన్ ఆధ్వర్యాన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. భెల్ హెచ్‌పివిపి యూనిట్‌లో కార్మిక, ఉద్యోగుల పిఎఫ్ సర్వీస్‌కు సంబంధించి 1992కు బదులు 1997 పడిందని తెలిపారు. కొంతమంది కార్మికులకు 2011వ సంవత్సరం పడిందని వివరించారు. దీనిపై ఉన్నత యాజమాన్యం, గుర్తింపు యూనియన్ పిఎఫ్ యాజమాన్యంతో పలు దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేదని తెలిపారు. 95 హయ్యర్ పెన్షన్ అందరికీ రిజెక్ట్ అయిందని, వీటిని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గుర్తింపు యూనియన్ నాయకులు సుబాకర్ సాహు, బోండా బాబూరావు, పివిఎన్.రాజు, కొల్లి దేముడు, భాస్కర్, బి.రవీంద్రబాబు, అనకాపల్లి శ్రీను, ఎ.వెంకట్రావు ఉన్నారు.

కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న గుర్తింపు యూనియన్ నాయకులు

దేవన్‌రెడ్డిని కలిసిన వెంకటరమణ తదితరులు

దేవన్‌రెడ్డిని కలిసిన చిత్రాడ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ వైసిపి బిసి.సెల్ అధ్యక్షునిగా నియమితులైన చిత్రాడ వెంకటరమణ ఆదివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు పార్టీ అధ్యక్షులు బి.గోవింద, బిసి సెల్ జనరల్ సెక్రటరీ ఎన్నేటి రమణ, నాయకులు ఎల్ఐసి.నాయుడు, చిత్రాడ రాజు, తిలక్‌రాజు, హరీష్‌వర్మ, సీతారామరాజు, ఎస్.గణపతి, అప్పలనారాయణ, పోలాకి శ్రీను, గాలి ఉన్నారు.

నన్ను గెలిపిస్తే ప్రతి ఉపాధ్యాయుడూ గెలిచినట్టే

- పిఆర్‌సి, డిఎలు ఇవ్వని వారికి ఓట్లు అడిగే హక్కులేదు
- పెద్దల సభ ఔన్నత్యాన్ని కాపాడండి
- పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

'నన్ను గెలిపిస్తే ఉత్తరాంధ్రలో ప్రతి ఉపాధ్యాయుడూ గెలిచినట్టే... ఇప్పటి వరకు తనకు ఏ పదవీ లేకపోయినా యుటిఎఫ్‌లో నాయకురాలిగా ఉపాధ్యాయ సమస్యలపై 33 ఏళ్లుగా పోరాటం చేసి చూపించాను. ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే ఉపాధ్యాయుల తరపున మరింత గళం వినిపించేందుకు అవకాశం ఉంటుంది' అన్నారు.. పిడిఎఫ్ తరపున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన కోరెడ్ల విజయగౌరి. శాసన మండలిలో స్వతంత్రంగా పనిచేసేవారు అవసరమని, అందుకు భిన్నంగా పాలకపార్టీలు రాజకీయ రంగు పులుముతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పెద్దలసభ ఔన్నత్యాన్ని కాపాడాల్సిన అవసరం, బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పిఆర్‌సి, డిఎ ఎరియర్స్ వంటి ఆర్థిక అంశాలపై ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేని వారికి, చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీయని వారికి ఉపాధ్యాయ ఓట్లు అడిగే హక్కులేదని ఆమె అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు.

గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసినవారు సమస్యలను గాలికి వదిలేసి, ప్రభుత్వాలకు అనుగుణంగా వ్యవహరించడం వల్ల ఉత్తరాంధ్రా నుంచి ఉపాధ్యాయుల గొంతు రాష్ట్రంలో వినిపించలేదని అన్నారు. ఈ నేపథ్యంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేదని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో శాసన మండలి సభ్యునిగా పిడిఎఫ్ తరపున పోటీచేసే అవకాశం దక్కిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం శాసన మండలిలో పిడిఎఫ్ నిలదీస్తున్నందున పాలకపార్టీ వెన్నులో వణుకు పుట్టిందని, అందుకే తమకు అనుకూలంగా ఉండేవారిని బల పరుస్తూ ఉపాధ్యాయులను తప్పుదారి పట్టిస్తున్నారని వివరించారు. తనకు అవకాశం కల్పిస్తే విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల రక్షణ కోసం పని చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వాలు విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ప్రాథమిక, ఉన్నత విద్యలో ఇప్పటికే నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో 117 జిఒను రద్దు చేయాలని యుటిఎఫ్ బయట, శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పెద్దఎత్తున పోరాటం చేసినట్లు తెలిపారు. చట్టసభల్లో ప్రశ్నించేవారు లేకుండా చేసేందుకు పాలకపార్టీలు పావులు కదుపుతున్నాయని విమర్శించారు. ఇందులో భాగంగానే గత నెలలో జిఒ 117ను రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించి, తిరిగి అదే విధానాలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్లస్2 వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించినప్పటికీ ఫౌండేషన్ క్లస్టర్ పాఠశాల కేంద్రీకరణ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం కోసం, ప్రభుత్వ విద్యా రంగాన్ని నష్టం చేసే సంస్కరణలకు వ్యతిరేకంగా మీ గొంతుకై నిలబడతానని హామీనిచ్చారు. సిపిఎస్ రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

ఆర్థిక పరమైన అంశాలు పిఆర్‌సి, డిఎలు లేవని, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.25 వేల కోట్లు ఇవ్వలేదని తెలిపారు. వీటి కోసం, ఐఆర్, డిఎల సాధనకు పోరుబాట ద్వారా కృషి చేస్తానని తెలిపారు. ఒకే యాప్‌లో 40 యాప్‌లు ఇమిడ్చే ప్రయత్నం నేటి కూటమి ప్రభుత్వం చేస్తుందని, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలహీన పర్చే యాప్‌ల వ్యవస్థ రద్దు కోసం పోరాడతానని చెప్పారు. వివిధ రకాల యాజమాన్యాల కింద పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కెజిబివి ఉపాధ్యాయులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందన్నారు. వారికి హెచ్‌ఆర్ పాలసీ, మినిమం టైం స్కేల్ కోసం, మోడల్ స్కూల్ సర్వీస్ రూల్స్ సాధనకు పోరాటం చేస్తామని చెప్పారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో పని చేసే ఉద్యోగులకు సంక్షేమ నిధి, హెల్త్ ఇన్సూరెన్స్, ఉద్యోగ విరమణ అనంతరం పింఛను అమలుకు పోరుబాట సాగిస్తామని తెలిపారు. ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఒకేషనల్ వంటి టెక్నికల్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద, కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులర్ కోసం పోరాడుతామన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేసే ఎన్ఇపి రద్దు కోసం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని, మీకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లో ఆదరణ బాగుందని, పిడిఎఫ్ విజయానికి సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, నాయకులు సిహెచ్.తిరుపతినాయుడు, ఎన్.సత్యనారాయణ, కె.అప్పారావు, పి.రాంప్రసాద్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో ఆనందం పంచుకుంటున్న లెనిన్‌బాబు

జెఆఫ్‌ఆర్‌కు లెనిన్‌బాబు ఎంపిక

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

యుజిసి నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జెఎఫ్ఆర్)కు మండలంలోని రాజాం గ్రామానికి చెందిన నాగులపల్లి లెనిన్‌బాబు ఎంపికయ్యాడు. యుజిసి ఆధ్వర్యంలో నిర్వహించి ఈ పరీక్షకు 8 లక్షల మందికి పైగా దరఖాస్తు చేయగా, ఆరు లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. కామర్స్ విభాగంలో 52,000 మంది పైగా విద్యార్థులు హాజరుకాగా, ఈ విభాగంలో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు లెనిన్ బాబు ఎంపికయ్యాడు. యూజీసీ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల వరకు ఫెలోషిప్‌లో భాగంగా స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుంది. రాజాం మాజీ సర్పంచ్ నాగులపల్లి సత్యనారాయణ కుమారుడైన లెనిన్‌బాబు జెఎఫ్ఆర్‌కు ఎంపిక కావడం పట్ల కుటుంబీకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఘనంగా శ్రీవీరాంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో శ్రీవీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి దంపతులు విగ్రహ కలశ ప్రతిష్ట పూజలు చేసి దర్శించుకున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు, వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ దంపతులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, మాజీ విప్ కరణం ధర్మశ్రీ, టిడిపి నేత గండి వంశీదీప్ పలువురు నేతలు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, నాయకులు తమరాన బంగారు నాయుడు, బైలపూడి సత్యం, యడ్ల నాయుడు, ఐడి బాబు, కర్రి బాబు, బోకం స్వామినాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రామాలయంలో పసిడి కలశం పున:ప్రతిష్ట

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామంలో రామాలయంలో ఆలయ శిఖరం పైనున్న పసిడి కలశం పున: ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ పసిడి కలశంను ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు, విశ్రాంత ఉద్యోగి కలగ వెంకటేశ్వరరావు, సర్పంచ్ కలగా రత్నం సోమేశ్వరరావు, కలగా గోవింద ఆర్థిక సహకారంతో ఈ పూజ కార్యక్రమం జరిగింది. రామాలయం పురోహితలు శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు గ్రామాలు ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి 33-11 సబ్ స్టేషన్ పరిధి 11కెవి టౌన్ కొత్త ఫీడర్ లైన్ నిర్వహణ పనులు జరుగుతున్న నేపథ్యంలో దాని పరిధిలో సోమవారం ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఈఈ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి మిలటరీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, స్టేషన్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, ద్వారకానగర్, నెహ్రూనగర్ తదితరు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయ సమస్యలపై గొంతెత్తే విజయ గౌరిని గెలిపించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం గొంతెత్తే పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం అనకాపల్లిలోని పూడిమడక రోడ్డు, శారదానగర్, సత్యనారాయణ పురం, చవితిన వీధి, కస్పావీధి, విద్యుత్ నగర్, మసీదు వీధి తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. పిఆర్‌సి సమస్యలపైనా, నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా, రేషలైజేషన్ వంటి సమస్యలపైనా, ఉపాధ్యాయుల హక్కులను కాపాడాలని యుటిఎఫ్ నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నికరంగా పోరాడిన విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఇప్పటివరకు పిడిఎఫ్ తరపున ఎన్నికైన ఎమ్మెల్సీలు ఉద్యోగ ఉపాధ్యాయ గొంతుకగా శాసన మండలిలో పనిచేశారని, వారి వారసత్వం తీసుకొని పని చేయడానికి సిద్ధంగా ఉన్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఇతర ఉపాధ్యాయ సంఘాల నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి, అధికార పార్టీలతో అంటకాగి ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాలను నెరవేర్చుకున్నారని గుర్తు చేశారు. అటువంటి వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు శ్రీలక్ష్మి, రాజేష్, సతీష్ బి.ఉమామహేశ్వరరావు, జె.రమేష్, ఆర్.శంకరరావు, జి.శ్రీరామ్, ఎ.రాజు, ఎం.బాబురావు, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

విజయ గౌరిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న యుటిఎఫ్, ప్రజా సంఘాల నేతలు

ఉద్యానవన పథకాలు రైతులకు అందజేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : ఉద్యానవన శాఖ అందిస్తున్న పథకాలు అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకరరావు అధికారులకు ఆదేశించారు. మండల కేంద్రంలోని జాగృతి అమృతఫల కార్యాలయంలో ఆదివారం దేవరాపల్లి, కె.కోటపాడు, సబ్బవరం మండలాల రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యానవన శాఖ అందిస్తున్న ప్రభుత్వ పథకాలను రైతులకు సకాలంలో అందేలా రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జులు చర్యలు తీసుకోవాలన్నారు. టమాటా సాగు విస్తీర్ణం, మార్కెటింగ్, ధరల విషయాలపై సమీక్షించారు. ఈ మూడు మండలాలలో టమాటా పండించిన రైతులు సకాలంలో మార్కెటింగ్ చేసుకొని ఫలసాయాన్ని పొందినట్లు తెలిపారు. జీడి మామిడి, మామిడి పూత దశలోనూ, పిందెల దశలోనూ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు సేవా కేంద్రాల ఇన్చార్జిలకు పలు సూచనలు అందించారు. ఈ విషయమై రైతులకు తగు సలహాలు సకాలంలో ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఆర్.కిరణ్మయి, అమృతఫల అకౌంటెంట్ అనూష, సబ్బవరం, కే కోటపాడు, దేవరాపల్లి మండలాల రైతు సేవా కేంద్రాల ఇన్చార్జులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జులు

సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోలార్ విద్యుత్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-చోడవరం : సోలార్ విద్యుత్ వినియోగం, ఏర్పాటు, నిర్వహణపై స్థానిక వాకర్ ఫ్రెండ్స్ హెల్త్ క్లబ్ భవనంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్కో సోలార్ ఎనర్జీ కంపెనీ నిర్వహించిన ఈ సదస్సుకు క్లబ్ సభ్యులు జలుమూరి కాశీరాజు అధ్యక్షత వహించారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనలో భాగంగా ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు గురించి వివరించారు. సోలార్ ఆన్‌లైన్ వెండర్ కృష్ణారావు మాట్లాడుతూ రానున్న కాలంలో సోలార్ యుగం వస్తుందన్నారు. ప్రభుత్వం రాయితీ అందిస్తూ సోలార్ వినియోగాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు. మెస్కో సోలార్ ఎనర్జీ ఖాజా రాయితీలు గురించి వివరించారు. చిన్న పాటి వెలుతురులో సోలార్ ప్యానెల్‌లు రీఛార్జి అవుతాయని చెప్పారు. బొడిగ శ్రీనివాస్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగదారుకు మంచి సర్వీస్ అందిస్తామని చెప్పారు. ఎవరైనా ఓ యూనిట్ కొనుగోలు చేస్తే దానిలో రెండు వేల రూపాయలు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి జాజుల జగ్గారావు, కంపెనీ మేనేజర్ గోపి, చోడవరం డీలర్ బొడిగ శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దొండక శ్రీనివాస్, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వేగి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయితీ పరిధి పెదనాయుడుపాలెం శివారు గణపతిపురం గ్రామంలో మల్లిఖార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి, ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఉదయం నుండి పూజలు, మధ్యాహ్నం 3 గంటల నుండి మహిళలు పసుపు నీళ్ల బిందెలతో చిడతలతో ఊరేగింపు ఉందని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు గ్రామ స్థాయి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. రాత్రి 10 గంటల నుండి గ్రామ యువకులచే గ్యాంగ్ లీడర్ అనే సాంఘిక నాటకం ప్రదర్శించబడుతుందని తెలిపారు. 28న ఆలయం వార్షికోత్సవం సందర్భంగా భ్రమరాంబిక మల్లిఖార్జునస్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న సంతర్పణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గొర్లివానిపాలెంలో...

సబ్బవరం మేజర్ పంచాయితీ శివారు గొర్లివానిపాలెం గ్రామంలో శ్రీఉమా రామలింగేశ్వర శ్రీలక్ష్మి సత్యనారాయణమూర్తి శ్రీ కోదండ సీతారామ స్వామి వార్ల దేవస్థానంలో 48వ కళ్యాణ వార్షికోత్సవం, మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 24 నుండి 26వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ఆనువంశిక ధర్మకర్త గొర్లి అచ్చంనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 26న రాత్రి 7.30 గంటల నుండి శ్రీఉమా రామలింగేశ్వర స్వామి శ్రీలక్ష్మీ సత్యనారాయణమూర్తి శ్రీ కోదండ సీతారామ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 27న సాయంత్రం 6 గంటల నుండి అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వేచలం గ్రామంలో నూతన రామాలయంలో వినాయక సహిత సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వారి విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించారు. అర్చకులు పాకల కామేశ్వరరావు శర్మ ఆధ్వర్యంలో 43 అడుగుల ఏకశిల ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గవిరెడ్డి రామానాయుడు, జెడ్పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపీపీలు కిలపర్తి భాస్కరరావు, పోతల రమణమ్మ, రెడ్డి జగన్మోహన్, సర్పంచ్ నాగిరెడ్డి శేటార్‌నాయుడు, ఎంపిటిసి లక్ష్మి బలరాం, టిడిపి, జనసేన మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, గోర్రపోటు రామూర్తి నాయుడు, పోతల పాత్రు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు అనుభవిస్తున్న ప్రతి సౌకర్యం పాలకవర్గాల దయాదాక్షిణ్యం మీద వచ్చింది కాదని, పోరాటాల ద్వారా సాధించుకున్నదేనని ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం స్థానిక సిబిటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1982లో సాధించిన రిగ్రూపింగ్ స్కేలు, అప్రెంటిస్ విధానం రద్దు, డిఏ సాధన, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పిఆర్‌సి, కౌన్సిలింగ్ విధానం ఇవన్నీ పోరాడి సాధించుకున్నవే తప్ప, ఎవరో దయాదాక్షిణ్యం మీద ఇచ్చినవి కాదని స్పష్టం చేశారు. పోరాట కార్యక్రమాన్ని ఇచ్చిన ప్రతి సందర్భంలో, ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని, విజయాలు సాధించామని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా వచ్చిన హక్కులన్నీ నిలబెట్టుకోవడానికి, రక్షించుకోవడానికి నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ఐక్య పోరాటాలు చేయాలన్నారు. సమస్యలపై పోరాటాలు జరిగిన ప్రతి సందర్భంలోనూ పాలకవర్గాలు దానిని బలహీనపర్చడానికి కొద్ది మందిని తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయని, అయినా కింద ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు ఐక్యంగా నిలబడి పోరాడినట్లు తెలిపారు.

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మేజు శ్రీనివాసరావు మాట్లాడుతూ 11వ పిఆర్సిలో 23శాతం మాత్రమే ఫిట్మెంట్ ఇచ్చి, గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల్ని మోసం చేసిందని చెప్పారు. ఇప్పుడు 12వ పిఆర్సి, డిఎలు, ఆర్థిక బకాయిలు ఇవ్వకుండా ప్రస్తుత ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తుందన్నారు. వీటిని సాధించుకోవటానికి తప్పని పరిస్థితుల్లో పోరాట మార్గాన్ని ఎంచుకోవాల్సి ఉందని తెలిపారు. యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేయటం కోసం

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

విద్యార్థుల ఎన్రోల్మెంట్ ప్రక్రియలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. బాధ్యతల కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని, తద్వారా హక్కుల సాధనలో ఉద్యమాలు పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్ అంబేద్కర్, నాయకులు జోగా రాజేష్, వి రమేష్‌రావు, మామిడి బాబూరావు, నాతవరపు సతీష్, రవి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పార్వతమ్మ పోరాటాలు నేటి తరానికి ఆదర్శం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సిపిఎం సీనియర్ నాయకురాలు, మహిళా ఉద్యమ నేత కీర్తిశేషులు కర్రి పార్వతమ్మ చేసిన పోరాటాలు నేటి తరానికి ఆదర్శనీయమని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో శనివారం రాత్రి పార్వతమ్మ ద్వితీయ వర్ధంతి కార్యక్రమం ఆమె కుటుంబీకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు చేతుల

మాజీ ఎంపీ పప్పల చలపతిరావును సత్కరిస్తున్న దృశ్యం

మీదుగా అచ్యుతాపురం, మునగపాక ఎంపీపీలు కోన సంధ్య, మళ్ల జయలక్ష్మి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, పెదపాడు, జగన్నపేట, హరిపాలెం, తిమ్మరాజుపేట గ్రామాల మహిళా సర్పంచ్‌లు తదితరులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ పార్వతమ్మతో రాజకీయపరమైన, కుటుంబపరమైన సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా సమాజ శ్రేయస్సుకు ఆమె అనేక ప్రజా పోరాటాలను చేపట్టి మహిళా లోకానికి ఆదర్శనీయంగా నిలిచారని తెలిపారు. ఆమె పోరాటాలను ఆదర్శంగా తీసుకొని నేటితరం మహిళలు సమాజ సేవకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు కర్రి సుందరయ్య, డైరెక్టర్ రమణాజీ, సర్పంచులు ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు, జనపరెడ్డి అరుణ, మారిశెట్టి లక్ష్మీ కాంతం, దొడ్డి వెంకటలక్ష్మి, కసింకోట ఆర్‌ఈసిఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీశెట్టి ఉమా శంకర్ నాయుడు బాబు, కర్రి స్వామిబాబు, కాంచన, కుటుంబీకులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

చెస్ టోర్నమెంట్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బాపట్ల చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెస్ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎం సునీల్ మాట్లాడుతూ ఏప్రిల్ 26 నుండి 30వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ వద్ద ఈ చెస్ పోటీలు జరుగుతాయని తెలిపారు. రూ.12 లక్షల ప్రైజ్‌మనీతో క్లాసికల్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్‌తో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ డైరెక్టర్ డీఎస్ లక్ష్మి, బోడ సునీత, ఎం సునీల్, మాజీ జెడ్పిటిసి గోకివాడ కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఎంవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

మంచినీళ్లు ఇప్పించండి మహాప్రభో..

- ఊటగెడ్డలో బిందెలతో గిరిజనుల వినూత్న నిరసన

- 10 రోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే కలెక్టరేట్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి-దేవరాపల్లి

'మాకు మంచినీళ్లు ఇప్పించండి మహాప్రభూ' అంటూ మండలంలోని వాలాబు పంచాయతీ శివారు నగరంపాలెం గ్రామ ఆదివాసీలు వినూత్నంగా నిరసన తెలిపారు. రోజూ తాగునీటిని సేకరించే ఊట గెడ్డలో మహిళలు, చిన్న పిల్లలు సైతం బిందెలు నెత్తిన పెట్టుకొని, దండం పెడుతూ తమకు తాగునీరు కల్పించాలని అధికారులను వేడుకున్నారు. వీరికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ తరాలు మారినా ఆదివాసీల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 78 ఏళ్ళ స్వాతంత్ర్య భారతంతో తాగునీరు కూడా అందించలేని స్థితిలో పాలకులు ఉండడం దౌర్భాగ్యమన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిధుల మంజూరు చేసి సగం వరకు పైపులైన్ వేసి విడిచిపెట్టారని పేర్కొన్నారు. పైపులైన్ అనుమతి కోసం ఫారెస్టు అధికారులు కొర్రీలు పెడుతున్నారన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం వెదురు రవాణాకు ఫారెస్టు అధికారులే నగరంపాలెం మార్గాన రోడ్డు వేశారని, ఆ మార్గం ద్వారా పైపులైన్ వేసి చిన్నపాటి ట్యాంక్ నిర్మాణం చేసి కుళాయి సౌకర్యం కల్పించవలసి ఉందని తెలిపారు. దీనికి అనుమతుల

ఊటగెడ్డలో బిందెలు పట్టుకొని దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

కోసం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు అటవీశాఖను కోరగా, ఫారెస్టు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వేసవి కాలం సమీపించడంతో గెడ్డనీరు కూడా దొరికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతికి ప్రతిపాదనలు పరిశీలించడానికి ఫారెస్టు డిఎఫ్ఒ వచ్చినప్పుడు గిరిజనులు ఈ విషయాన్ని తెలియజేసినా ఆయన పెడచెవిన పెట్టారని మండిపడ్డారు. దట్టమైన అటవీ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్లాంట్‌కు అనుమతి ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ గిరిజనులకు మంచినీటి సౌకర్యం కల్పించడంలో లేదన్నారు. తాగడానికి మంచినీటి సౌకర్యం కల్పించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని, దానిని కూడా నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. 10 రోజుల్లో నగరంపాలెం గిరిజనులకు కుళాయిల ద్వారా ఇంటింటికి మంచి నీటి సౌకర్యం కల్పించకపోతే ఖాళీ బిందెలతో అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వంతల మహేష్, సుకూరి రామకృష్ణ, తామర్ల బుచ్చమ్మ, మామిడి రవికుమార్, వంతల దేముడు, వంతల చిన్నారావు, సుకూరి గంగమ్మ, కిమిడి సన్యాసిరావు, అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు మరో పోరాటం

కృష్ణదేవిపేటలో అల్లూరి శతవర్ధంతి జాతాలో పలువురు వక్తలు

అల్లూరి సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న ఉత్సవ కమిటీ నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : దోపిడీ రహిత సమాజస్థాపనకు మరో పోరాటానికి సన్నద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి జాతా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట చేరుకుంది. ఈ సందర్భంగా అల్లూరి పార్కులోని అల్లూరి, గంటందొర సమాధులకు నివాళులర్పించారు. అనంతరం పౌరచైతన్య వేదిక కార్యదర్శి సిహెచ్.ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన సభను చిటికెల భాస్కర్‌నాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం వాడపల్లి వెంకట రమణమ్మ మాట్లాడుతూ స్వతంత్ర సంగ్రామంలో అల్లూరి పాత్రను వివరించారు. అల్లూరి శతవర్ధంతి నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.గోవిందరాజులు మాట్లాడుతూ నాడు మన్యంలో అల్లూరి చేసిన పోరాటాలు, నేటి సమాజంలో ఎంతో అవసరమన్నారు. అల్లూరి శతవర్ధంతి సందర్భంగా ఏడాదిగా అనేక జిల్లాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు, విద్యార్థులకు పోటీలను నిర్వహించామని, ముగింపుగా ఈనెల 22, 23 తేదీల్లో విశాఖ నుండి కెడిపేట అల్లూరి పార్కు వరకు బస్సు జాతా నిర్వహించామని వివరించారు. పౌర చైతన్య వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ కొలవెన్ను చందు మాట్లాడుతూ ఇంతవరకు పాఠ్యాంశాల్లో అల్లూరి జీవితవిశేషాలు తెలుసుకొని పని చేశామని, ఇప్పుడు అల్లూరి ఆశయసాధనకు ముందుకు వెళ్లాలన్నారు. అల్లూరి శతవర్ధంతి కమిటీ ప్రతినిధి.రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రజలు పడే కష్టాలు, దోపిడి నుంచి వారిని విముక్తులను చేసి, స్వాతంత్ర్య సముపార్జనే లక్ష్యంగాపోరాటం సాగించిన అల్లూరి, ప్రజల కోసమే 27ఏళ్ల చిరుప్రాయంలోనే అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో స్టాండ్లీ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.గంగాధర్, ఆల్ ఇండియా డెమొక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు హరీష్ కుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మహేష్, వివిధ జిల్లాల నాయకులు బసవరాజు సురేష్, త్రినాథ్, శివప్రసాద్, సురేష్, మల్లేష్, తిరుపతి, నవీన్‌తోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో అల్లూరి శత వర్ధంతి జాత

నర్సీపట్నం టౌన్ :విప్లవ వీరుడు అల్లూరి శత వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు ఉత్సవ నిర్వహణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నర్సీపట్నంలో అల్లూరి శత వర్ధంతి జాతా ర్యాలీ నిర్వహించారు. నర్సీపట్నం వాసవి కళ్యాణ మండపం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీలో అధికసంఖ్యలో విద్యార్థులు, అల్లూరి అభిమానులు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. అక్కడ నుంచి బ్రిటిష్ సైనిక అధికారుల (కవర్డ్, హైటర్)సమాధుల వరకు ర్యాలీ కొనసాగించారుఅక్కడ నుంచి గొలుగొండ మండలం కృష్ణదేవిపేటకు పయనమయ్యారు.

మయన్మార్‌లో చిక్కుకున్న యువకులను రప్పించేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ

మయన్మార్‌లో చిక్కుకున్న మణికంఠ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం బూరుగుపాలెం గ్రామానికి చెందిన వబ్బులరెడ్డి మణికంఠతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మరో ముగ్గురు యువకులు ఉపాధి నిమిత్తం మయన్మార్ (బర్మా) వెళ్లారు. వీరిని తీసుకెళ్లిన ఏజెంట్, వాగ్దానాల మేరకు సరైన పని ఇవ్వకుండా అనేక రకాల ఇబ్బందులకు గురిచేశాడు. తక్కువ వేతనంతో బలవంతంగా పనిచేయించేందుకు ప్రయత్నించడంతో వారు స్వదేశానికి తిరిగి రావాలని భావించారు. అయితే ఆ దేశంలో వర్క్ పర్మిట్ సమస్యలు తలెత్తడంతో అక్కడే చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు , వెంటనే స్పందించి బాధితులను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను వ్యక్తిగతంగా సంప్రదించి వారికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్పీకర్ సూచనల మేరకు సంబంధిత అధికారులతో సమన్వయం జరిపి బాధితుల రక్షణకు తగిన చర్యలు తీసుకున్నారు. మయన్మార్ ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపి వీరిని తిరిగి భారతదేశానికి తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు చేయించారు. విషయాన్ని తెలుసుకున్న బాధితుల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు కృతజ్ఞతలు తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి, . ప్రభుత్వ చొరవతో త్వరలోనే మయన్మార్‌లో చిక్కుకున్న యువకులు స్వస్థలాలకు చేరుకోనున్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని అండిబ పంచాయతీ కేంద్రంలో మత్స్యదేవత జాతర సందర్భంగా నిర్వహిస్తున్న మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం స్థానిక సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, మండల వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తామర్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 24,25 తేదీల్లో మెగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, వాలీబాల్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొవాలని పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొనే జట్లు ప్రవేశరుసుముగా రూ. 600 చెల్లించాలన్నారు. టోర్నీలో విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.పదివేలు, మూడోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.ఐదు వేలు నగదు బహుమతి అందజేస్తా మన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోటీలు ముగింపు రోజు ఈనెల 25న శివరాత్రి ఉత్సవాల జాతర వేదికపైనే బహుమతులు అందజేస్తామన్నారు.

ఆసక్తి ఉన్న వాలీబాల్ జట్లు వివరాలకు సివేరి ఈశ్వరరావు 89857 62780, రవీంద్రపడాల్ 85007 98970లను సంప్రదించాలని సూచించారు. ప్రారంభ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాడి రాజారావు, పీసా కమిటీఉపాధ్యక్షుడు పాడి నరసింహ మూర్తి, తెలుగు యువత నేత సివేరి ఈశ్వరరావు, సంసాడ అప్పన్న, పాడి క్రిష్ణ, బొడ్డ శివ, పి. పెంటన్న, సివేరి సత్యనారాయణ, మేనేజ్‌మెంట్ కమిటీ పాడి శివప్రసాద్, చిట్టపులి రవీంద్ర పడాల్, గెమ్మెలి కొండబాబు, బొడ్డ సన్యాసిరావు, సత్యనారాయణ, చిట్టి పడాల్, దూసూరు అప్పలకొండ, సూరిబాబు, సురేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదులకు తావులేకుండా పనిచేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ప్రజలకు ఇబ్బందులు, ఫిర్యాదులకు తావులేకుండా విధులు నిర్వహించాలని ఆర్‌టిసి అధికారులు, యంత్రాంగానికి విజయనగరం జోన్ 1 డిప్యూటీ సిటిఎం(ఆపరేషన్స్, కమర్షియల్), విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి బి.అప్పలనాయుడు సూచించారు. ఆదివారం నర్సీపట్నం ఆర్‌టిసి డిపోను బస్‌కాంప్లెక్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మహాశివరాత్రిసందర్భంగా పాడేరు నుంచి మత్స్యగుండంకు, విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌కు, అదేవిధంగా అనకాపల్లి, నర్సీపట్నం డిపో నుండి కల్యాణపులోవ, దారమట్టం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులలో ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా సాధారణ చార్జీలతో ప్రయాణించవచ్చన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా రవాణాధికారి

పార్సిల్ రవాణాలో విజయనగరం జోన్ 1 ముందంజలో ఉందన్నారు. డోర్ డెలివరీ సౌకర్యాన్ని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. అనంతరం డిపోలోని ట్రాఫిక్, గ్యారేజ్ సెక్షన్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం డిపో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఆచారి, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలవికాస్ గురువులకు శిక్షణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థలు, విద్యా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నర్సీపట్నం సత్యసాయి సేవా సమితి మందిరంలో బాలవికాస్ గురువులు శిక్షణనిచ్చారు. సేవాసమితి జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ, సత్యసాయి శతజన్మదినోత్సవం సందర్భంగా జిల్లాలో 100 కొత్త బాల వికాస్ కేంద్రాలను ప్రారంభించామని, వాటి గురువులకు శిక్షణనిచ్చినట్లు తెలిపారు శిక్షణ ఫ్యాకల్టీ గా సాయి సంతోషి, సరస్వతి, శంకర్ వెంకట్ వ్యవహరించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ రామకృష్ణ, శంకర్, శక్తి మూర్తి, పప్పల సత్యనారాయణ, సత్యనారాయణ, రామకృష్ణ, కొంగసింగి సత్యనారాయణ పాల్గొన్నారు.

శివపార్వతుల విగ్రహాల ప్రతిష్ఠ

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని జానకిరామపురం గ్రామంలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం శివపార్వతుల ఉత్సవ పంచలోహ విగ్రహాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 26న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, అదేరోజు మధ్యాహ్నంఅన్న సమారాధన ఉంటుందన్నారు. అలాగే సాయంత్రం ఏడు గంటల నుంచి 12 గంటల వరకు జాగరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏళ్ల తరబడి నిరుపయోగంగా దుకాణ సముదాయం

ప్రారంభించినా వినియోగంలోకి రాని దుకాణ సముదాయం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని లింగాపురం సెంటర్ వద్ద గత టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించి, ప్రారంభించిన దుకాణ సముదాయాన్ని, వైసిపి ప్రభుత్వ హయాంలో రెండేళ్లక్రితం మరోమారు అర్భాటానికి అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించినా, నేటికీ వినియోగంలోకి రాలేదు. దాదాపు రూ.19 లక్షలతో 17 దుకాణాల నిర్మాణం చేపట్టారు. అయితే ప్రారంభించిన దుకాణాలు తెరుచుకోకపోవడంతో దీనిపై అధికారుల నిర్లక్ష్యమా? లేక నాయకుల చేతకానితనవ? అంటూ ప్రజలు, చర్చించుకుంటున్నారు , సమీప ప్రాంతం నాలుగు రోడ్ల జంక్షన్ కావడంతో నిత్యం రద్దీగా కనిపిస్తుంది అక్కడ నేలపైనే దుకాణాలు వేసి, తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో లక్షల రుపాయల ప్రజాధనంతో నిర్మించిన దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తేవడంతో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడుతున్నారు. పలుమార్లు అధికారులు, నాయకులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పూర్తయి, దాదాపు మూడేళ్లుగా వృథాగా పడి ఉన్న ఈ దుకాణ సముదాయాన్ని శిథిలమై, పాడవ్వకముందే వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

మేజర్ గోకులం నిర్మాణాలు పూర్తయ్యేనా?

- అర్థాంతరంగా నిలిచిన పనులతో ఒనగూరని ప్రయోజనం
- కూటమి ప్రభుత్వంపై పాడిరైతుల కొండంత ఆశలు

ప్రజాశక్తి-కోటవురట్ల : రాష్ట్రవిభజన తర్వాత గత టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన మేజర్ గోకులం నిర్మాణాలు నేటికీ పూర్తికాని పరిస్థితి ఉంది.గ్రామీణ ప్రాంతాలలో పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న పాడిరైతులకు చేదోడుగా ఉండాలనే సంకల్పంతో నాటి తెలుగుదేశం ప్రభుత్వం 2014లో పాడిపై ఆధారపడి జీవిస్తున్న భూమిలేని రైతుల పశువులకు వసతిగా మేజర్ గోకులం పేరుతో పశువుల శాలల నిర్మాణాన్ని ప్రోత్సాహించారు. వీటి నిర్మాణానికి లబ్ధిదారుల వాటా, బ్యాంకు రుణం పోను ఎక్కువ మొత్తంలోనే ప్రభుత్వం ఆర్థికసాయం అందించి, వీటి నిర్మాణాలను ప్రోత్సాహించింది. ఈ క్రమంలో మండలంలో చిన్న బొడ్డేపల్లి, కొడవటిపూడి గ్రామాలలో పశువులకు హాస్టల్ మాదిరిగా వసతి సౌకర్యం కల్పించేందుకు రెండు కేంద్రాల ఏర్పాటు చేయదలిచారు, ఒక్కో కేంద్రం నిర్మాణాకి రూ.15 లక్షల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి, రెండు కేంద్రాల వద్ద కూడా పనులు మొదలుపెట్టారు. దీంతో వ్యవసాయ కూలీ పనులకు వెళ్లే పాడిపోషకులకు మేజర్ గోకులం ఉపయోగపడుతుందని అంతా ఆశించారు.

చిన్నబొడ్డేపల్లిలో పిల్లర్ల స్థాయిలోనే నిలిచి మేజర్ గోకులం భవనం

పశువులకు మేత, వసతి సహా పశు వైద్యుల పర్యవేక్షణలో సేవలు అందనున్న నేపథ్యంలో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావించారు. అయితే నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోవడంతో మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. 2019లో వచ్చిన వైసిపి ప్రభుత్వం గోకులాల వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో వివిధ దశల్లో నిలిచినపోయిన మేజర్ గోకులాల నిర్మాణాలు వృథాగా దర్శనమిస్తున్నాయి, 2024లో కూటమి ప్రభుత్వం రాకతో పాడి రైతుల్లో ఆశలు చిగురుతున్నాయి మేజర్ గోకులం పనులు ఇప్పటికైనా మొదలెట్టి రైతులకు పాడి రైతులకు ఆసరాగా నిలవాలని పాడిరైతులు ఆశిస్తున్నారు.

విజయకుమార్‌కు అభినందన

మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను సన్మానిస్తున్న విజయ్ కుమార్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం నర్సీపట్నం నియోజకవర్గ అధ్యక్షులుగా నియమితులైన బేతిరెడ్డి విజయ్‌కుమార్ ఆదివారం పార్టీ కార్యాలయంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను బేతిరెడ్డి విజయకుమార్ పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ తనకు పార్టీ అధిష్టానం, అధినేత జగన్మోహనరెడ్డి అప్పగించిన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు క్రిస్టియన్ సంఘ నేతలు దుశ్శాలువాతో విజయ్ కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణఅధ్యక్షులు ఏకా శివ, యూత్ అధ్యక్షులు తమరాన శ్రీను, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజబాబు విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. నీతి కథలు చదివించి, వాటిలోని అర్థాలను వివరించారు. గ్రంథాలయాధికారి రాజబాబు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని, విద్యార్థులు గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం ప్లీనరీకి తరలిన నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సమాచార హక్కు చట్టం 2005 రాష్ట్ర కమిటీ ప్లీనరీ సమావేశానికి అనకాపల్లి జిల్లా నుంచి ఐక్యవేదిక ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ, షేక్ షాహిన్‌షా, పత్తి రమణ ఉన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు ప్రవేశాలను అరికట్టాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్స్ ప్రక్రియ అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం అల్లిపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో .పి.శేఖర్ అధ్యక్షతన ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబోతున్న పిజి కామన్ ఎంట్రన్ టెస్ట్‌తో పాటు ప్రైవేట్ పిజి విద్యార్థులకు శాపంగా మారిన జిఒ 77 రద్దు చెయ్యాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. విద్యార్థులను చైతన్యం చేసేందుకు విశాఖ వేదికగా మే నెలలో విద్య, వైజ్ఞానిక,రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. .రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో కూటమి ప్రభుత్వం, ఎన్నికల సమయంలో విద్యార్థులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచింపోయిందని మండిపడ్డారు. దీనిపై విద్యార్థులను చైతన్యం చేసి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి హేమానంద్, మౌనిక, ఉపాధ్యక్షులు కిరణ్, అభి, కోశాధికారి భవాని పాల్గొన్నారు.

చినబొడ్డేపల్లిలో సమస్యల కొలువు!

- ఏళ్లుగడుస్తున్నా నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే..
- అసంపూర్తిగానే ప్రభుత్వ కార్యాలయాల భవనాలు
- కనీస సౌకర్యాలు లేక ఎనిమిది గ్రామాల ప్రజల అగచాట్లు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు, నేతలు

అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

ప్రజాశక్తి -కోటవురట్ల : చినబొడ్డేపల్లి సచివాలయం ఎనిమిది గ్రామాల సమూహం. ఇక్కడ సుమారు2300 జనాభా ఉన్నారు. చిన్న బొడ్డేపల్లి పంచాయతీ పరిధిలో ఆరు గ్రామాలు, ఆక్సాహెబ్ పేట పంచాయతీ పరిధిలో రెండు గ్రామాలు ఈ సచివాలయం పరిధిలో ఉన్నాయి, వైసిపి ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తరువాత సచివాలయ భవనం, రైతు భరోసా, హెల్త్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ, సహా జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టారు. అయితే ఇక్కడ 8 గ్రామాలకు సంబంధిం చి, జగనన్న కాలనీల్లో 11 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి, ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కటి కూడా నిర్మాణం పూర్తి కాకపోవడం విశేషం.

అధ్వానంగా ఉన్న వీధిరోడ్లు

దళిత కాలనీలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివాసం

దీంతో చిన్న బొడ్డేపల్లి సచివాలయ సిబ్బంది గతంలో నిర్మించిన పంచాయతీ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు, సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని పరిధిలోని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల పరిస్థితి అధ్వానంగానే ఉంది, చిన్న బొడ్డేపల్లి గ్రామంలో గతంలో ఇందిరమ్మ ప్రభుత్వంలో నిర్మించిన కాలనీ ఇల్లు శిథిలావస్థకు చేరుకున్నాయి, ఆ సమయంలో నిర్మించిన ఇళ్లను ఆన్‌లైన్ చేయడంతో, కొత్తగా ఇళ్ల మంజూరుకు ఆస్కారం లేక నేడు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలోనే దళితులు బిక్కుబిక్కుమంటూ జీవనం వెళ్ళదీస్తున్నారు, గత టిడిపి ప్రభుత్వంలో పశువుల హాస్టల్ పేరుతో ఏర్పాటు చేసిన మేజర్ గోకులం పనులు కూడా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, నేతల చొరవ లేమి, వెరశి చిన్నబొడ్డేపల్లి అభివృద్ధిలోనూ చిన్నదిగానే ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా, అధికారులు, నేతలు స్పందించి గ్రామ సమస్యలపై దృష్టి సారించి, వాటి పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

అవగాహన కల్పిస్తున్న డిపిఒ శిరీషా రాణి

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణపై రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి అన్నారు. ఆదివారం నక్కపల్లిలో చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. తడి పొడి చెత్త ఇంటింటా సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డుపైన, ఇంటి పరిసర ప్రాంతాలు, బయటన చెత్త వేయకుండా, తమకు ఇచ్చిన ప్లాస్టిక్ బుట్టల్లో వేయాలని సూచించారు. ఇంటింటా తడి పొడి చెత్తను సేకరించి, పారిశుధ్య కార్మికులకు అందజేస్తే, వారుసంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రతను బాధ్యతగా భావించాలని సూచించారు. నక్కపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ మూర్తి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి ఎం శ్రీను, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ పరిరక్షణ

హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యాన సైకిల్‌థాన్

సైకిల్‌థాన్‌లో పాల్గొన్న హెచ్‌పిసిఎల్ ఉద్యోగులు, కుటుంబసభ్యులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని హెచ్‌పిసిఎల్ అధికారులు నినదించారు. ఆదివారం ఉదయం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, విశాఖ లూబ్ ఆర్ఒ ఆధ్వర్యంలో సాక్ష్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయు అవుట్ గేటు పెట్రో నిలయం నుంచి బీచ్ రోడ్ వరకు సైకిల్ థాన్ నిర్వహించారు. హెచ్‌పిసిఎల్ అధికారులు, డీలర్లు, డెలివరీ సిబ్బంది నగరవాసులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రమైన ఇంధనాన్ని ముఖ్యంగా గ్రీన్‌ఎనర్జీని వినియోగిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, పెట్రోలియం ఉత్పత్తులను సంరక్షించుకుంటామని, బాధ్యతాయుత పౌరులుగా నడుచుకుంటూ దేశాభ్యున్నతిలో భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో విశాఖ రిఫైనరీ ఇడి రామనాథన్ రామకృష్ణన్, చీఫ్ రీజినల్ మేనేజర్ (లూబ్స్) ఎం. సుందరరావు, జనరల్ మేనేజర్ (రిటైల్) బొల్లు రవికాంత్, డిజిఎం (డైరెక్ట్ సేల్స్) సాయికుమార్ పాల్గొన్నారు.

ధారమట్టం, కల్యాణపులోవకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 25న మంగళవారం సాయంత్రం నుండి 27 గురువారం సాయంత్రం వరకు కల్యాణపులోవ, ధారమట్టం పుణ్యక్షేత్రాలకు 50 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నర్సీపట్నం ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎంఎస్ఎస్. ధీరజ్ తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు నర్సీపట్నం, కొత్తకోట, దొండపూడి, రావికమతం, కొంతలం, కశిరెడ్డిపాలెం నుంచి కల్యాణపులోవకు తిరగనున్నాయి.

అలాగే నర్సీపట్నం, గొలుగొండ, కృష్ణదేవిపేట, కంటారం తదితర ప్రాంతాల నుంచి ధారమట్టం వరకు ప్రత్యేక బస్సులు తిరగనున్నాయి. కల్యాణపులోవ, ధారమట్టం శివరాత్రి వేడుకలకు వెళ్లే భక్తులు, సందర్శకులు ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా సాధారణ చార్జీలతో నడిచే ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసుల సేవలను వినియోగించుకోవాలని డిఎం ధీరజ్ సూచించారు.